

ఒంగోలులోని పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



వృద్ధురాలిని పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్తూ...



ఒంగోలు ఆంధ్రా స్కూల్లో భారీగా ఓటర్లు

వెలిగిన వజ్రాయుధం..!



ఓటేసిన ఒంగోలు మేయర్ గంగాడ సుజాత



ఒంగోల్లో 102 ఏళ్ల వృద్ధురాలు ఖాశింబీని పోలింగ్ కేంద్రానికి తీసుకొస్తున్న మహిళలు



ఒంగోలులో ఓటేసేందుకు వీల్‌చైర్‌లో వచ్చిన వృద్ధురాలు



తొలిసారి ఓటేసిన యువతీయువకుడు



ఒంగోలు మండలం బీవీ పాలెంలో ఓటేసిన డైరెక్టర్ మలినేని గోపీచంద్



మడనూరులో సాయంత్రం 6.30 గంటలకు కూడా అధిక సంఖ్యలో ఉన్న ఓటర్లు

ఓటర్లు పోటెత్తారు. ఓటు ప్రకాశించింది. యువత క్యూ కట్టగా.. అవ్వాతాతలు అతికష్టం మీద వచ్చి ఓటేశారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. స్వల్ప సంఘటనలు మినహాయిస్తే.. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉండి మరీ వజ్రాయుధానికి పనిచెప్పారు. మహిళలు సైతం పోలింగ్‌కు పోటీపడి సంక్షేమంతో కూడిన తమ కుటుంబ భవితవ్యానికి బాటలు వేసుకున్నారు.

• • •

ఒంగోలు నియోజకవర్గంలో 82.15 శాతం పోలింగ్...

ఒంగోలు: ఒంగోలు నగరంలో దామచర్ల అరాచకాలు మినహాయిస్తే.. ఒంగోలు నియోజకవర్గంలో పోలింగ్ అంతా ప్రశాంతంగా జరిగింది. రాత్రి 11.30 గంటల వరకు అందిన సమాచారం మేరకు 82.15 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 11 గంటల నుంచి ఎండ మండిపోవడంతో పోలింగ్ కేంద్రాల వద్ద జనం పలుచబడ్డారు. మళ్లీ సాయంత్రం 3.30 గంటలకు వాతావరణం చల్లబడటంతో జనం మళ్లీ పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. పోలింగ్ తక్కువగా జరిగితే గెలుపు ఖాయం అనుకున్న తెలుగు తమ్ముళ్లకు ఇది శరాఘాతంలా మారింది. అధికారికంగా సాయంత్రం 6 గంటల సమయానికి 72 శాతం పోలింగ్ నమోదవగా, ఆ సమయానికి కేంద్రాలకు వచ్చిన వారితో రాత్రి వరకూ పలు ప్రాంతాల్లో పోలింగ్ జరుగుతూనే ఉంది.



ఒంగోలులో ఓటేసేందుకు భారీగా క్యూ కట్టిన ప్రజలు

ఒంగోలు మండలంలోని గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతం...

ఒంగోలు రూరల్: ఒంగోలు మండలంలోని గ్రామాల్లో ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, కొన్ని కేంద్రాల్లో సాంకేతిక లోపాలతో కొద్దిగా ఆలస్యమైంది. ఓటర్లు ఓటు వేసేందుకు బారులుదీరారు. గుండాయిపాలెం, యరజర్ల, చేజర్ల, త్రోవగుంట వడ్డెపాలెం పోలింగ్ కేంద్రాల్లో తోపులాటలు జరిగాయి. తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డి పర్యవేక్షించారు. త్రోవగుంట వడ్డెపాలెం కేంద్రంలో రాత్రి 11 గంటల వరకూ పోలింగ్ జరిగింది. బొద్దులూరివారిపాలెంలో సినీ డైరెక్టర్ మలినేని గోపీచంద్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: మండలంలోని 53 పోలింగ్ బూత్‌లలో మొత్తం 42,475 మంది ఓటర్లకుగానూ సాయంత్రం 5 గంటల వరకు 75.92 శాతం పోలింగ్ నమోదైంది. ఎండ పెరుగుతుందనే భయంతో ఉదయం ఆరు గంటలకే పోలింగ్ బూత్‌ల వద్దకు ఓటర్లు చేరుకుని 7 గంటల వరకు వేచి ఉన్నారు. 6.30 గంటలకు మాక్ పోల్ ప్రారంభించి 7 గంటలకు అన్ని బూత్‌లలో ఓటర్లతో ఓటు వేయించారు. చిన్నచిన్న సంఘటనలు మినహాయించి పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కొత్తపట్నం రెడ్డిపాలెం బూత్ నంబర్ 229 వద్దకు ఒంగోలు నుంచి టీడీపీ నాయకులు వచ్చి అల్లర్లు సృష్టించాలని చూశారు. వైఎస్సార్ సీపీ నాయకులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి అదుపు చేశారు. కె.పల్లెపాలెం, మడనూరు గ్రామాల్లో బూత్‌ల దగ్గర టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గీయులు వాదించుకున్నారు. పోలీసులు రంగప్రవేశం చేసి అదుపు చేశారు. మండలంలో 282 మంది ఎన్నికల సిబ్బంది, 300 మంది పోలీసులు కలిపి మొత్తం 582 మంది సిబ్బందితో ఎన్నికలు నిర్వహించారు. ఏడు మొబైల్ టీంలతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.



ఓటేసిన ఆనందంలో యువతులు



త్రోవగుంట వడ్డెపాలెం పోలింగ్ కేంద్రంలో సాయంత్రం 6 గంటలకు కూడా భారీగా ఉన్న ఓటర్లు



కొత్తపట్నం మండలంలో పోలింగ్ బూత్ నంబర్ 229 వద్ద ఉదయం 6.30 గంటలకే వేచి ఉన్న ఓటర్లు



త్రోవగుంటలోని పోలింగ్ బూత్ వద్ద కిక్కిరిసిన ఓటర్లు



ఒంగోలు గోపాల్‌నగర్లోని సెయింట్ జోసఫ్ పోలింగ్ కేంద్రంలో...



పోలింగ్ బూత్ వద్ద ఓటర్ల క్యూ...



ఒంగోలు పబ్లిక్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో భారీ క్యూ



కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామంలో ఉదయం 7 గంటలకే ఓటర్ల క్యూ...



ఓటేసేందుకు తరలివచ్చిన మహిళలు



ఒంగోలు ఉమామహేశ్వర కాలేజీ పోలింగ్ బూత్ వద్ద ఓటేసేందుకు బారులుదీరిన ఓటర్లు

సంతనూతలపాడు నియోజకవర్గంలో

86.17 శాతం పోలింగ్



చీమకుర్తి జెడ్పీ బాలికల హైస్కూల్ పోలింగ్ బూత్ వద్ద క్యూలైన్‌లో బారులుదీరిన ఓటర్లు

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద సోమవారం తెల్లవారకముందే ఓటర్లు క్యూలైన్లలో బారులుదీరారు. 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ శాతం ఆధిక్యత స్పష్టంగా కనిపించింది. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,16,638 మంది ఉండగా, వారిలో 1,70,637 మంది ఓటర్లు వారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాత్రి 11.30 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం పోలింగ్ శాతం 86.17గా నమోదై జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచింది. బూసురపల్లి, బండ్లమూడి గ్రామాల్లో చిన్నపాటి సంఘటనలు మినహా మొత్తం మీద నియోజకవర్గంలో 256 పోలింగ్ బూతులలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

ఓటర్లలో స్పష్టంగా కనిపించిన జగనన్న సంక్షేమం : మంత్రి మేరుగు నాగార్జున

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లపాటు పేద ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు ఓటర్లలో స్పష్టంగా కనిపించాయని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. సోమవారం పోలింగ్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేసిన తర్వాత ఇప్పటికే రెండు సార్లు సంతనూతలపాడు నియోజకవర్గంలో విజయం సాధించగా, తాజాగా మూడోసారి కూడా విజయం సాధిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో మంత్రి పర్యటించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఓటింగ్ శాతంపై సంతృప్తి వ్యక్తం చేశారు. గెలుపు ఖాయమని ధీమాగా తెలిపారు.

మద్దిపాడు మండలంలో వీచిన ఫ్యాన్ గాలి...

మద్దిపాడు: మండలంలో ఫ్యాన్ గాలి గట్టిగా వీచినట్లు తెలుస్తోంది. సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన ఓటర్లు మరోమారు తమ ఓటు హక్కుతో ఫ్యాన్‌ను గిరాగిరా తిప్పినట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రజలు ఉదయం నుంచే క్యూలలో నిలబడి ఓట్లు వేశారు. చాలా చోట్ల ఉదయం 7.30 వరకూ పోలింగ్ ప్రారంభం కాలేదు.



చీమకుర్తిలో వృద్ధురాలిని పోలింగ్ బూత్ వద్దకు తీసుకొస్తున్న మున్సిపల్ సిబ్బంది

తొలుత మందకొడిగా ప్రారంభమైన ఓటింగ్.. 11 గంటలకు ఊపందుకుంది. మధ్యాహ్నం 2 గంటల సమయానికి 50 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో సాయంత్రం ఐదు గంటల సమయానికి సుమారుగా 600 మంది క్యూలో నిలిచి ఉన్నారు. మరో 200 మంది వరకూ ఓటర్లు వస్తారని అంచనా ఉండగా, సాయంత్రం 6 గంటల్లోపు పాఠశాల ప్రాంగణంలో ఉన్న వారికి ఎంత ఆలస్యమైనా పోలింగ్ అధికారులు ఓటు హక్కు కల్పించారు.



ఇనమనమెళ్లూరులో సాయంత్రం ఐదు గంటల సమయంలో క్యూలో నిలబడి ఉన్న ఓటర్లు

- పోలింగ్ జరుగుతుండగా ఒంగోలులో అడుగడుగునా అరాచకం
- ఓటమి భయంతో టీడీపీ శ్రేణులతో కలిసి దాడుల పరంపర
- ఆడపిల్లకు చెప్పు చూపించి రెచ్చగొట్టిన టీడీపీ నాయకుడు
- వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రశ్నించడంతో ఎదురు తిరిగి రాద్ధాంతం
- 200 మందితో ఓ ప్రైవేటు అపార్టుమెంట్ సెల్లార్‌లోకి వెళ్లి మరీ దాడి చేయించిన దామచర్ల
- ఉదయం నుంచి క్యూలైన్లలోనే టీడీపీ ఏజెంట్లు
- సైకిల్ గుర్తుకు ఓటు వేయాలంటూ నిబంధనలు ఉల్లంఘించి ప్రచారం
- పట్టించుకోని పోలీసులు

దామచర్ల రౌడీయిజం

ఒంగోలు: ఓటమి భయంతో టీడీపీ ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సోమవారం ఎన్నికల పోలింగ్ జరుగుతుండగా అరాచకం సృష్టించాడు. ఒకటి కాదు.. రెండు కాదు... వరుస దాడులు కొనసాగించి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశాడు. అయితే, ఎక్కడికక్కడ వైఎస్సార్ సీపీ నేతలు అడ్డుకట్ట వేయడంతో చివరకు తోకముడిచాడు. తమ నేత వస్తే లేచి నిలబడటం తెలియదా..? అంటూ దళితులపై పరుష పదజాలంతో టీడీపీ నాయకులు రెచ్చిపోయారంటే.. రౌడీయిజాన్ని దామచర్ల ఏ స్థాయిలో ప్రోత్సహించారో అర్థం చేసుకోవచ్చు. ప్రశాంతంగా పోలింగ్ జరుగుతున్న వేళ కేవలం ఓటమి భయంతోనే దామచర్ల రెచ్చగొట్టి గొడవలకు దిగారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

యువతికి చెప్పు చూపించిన టీడీపీ నాయకుడు...

స్థానిక ఉమామహేశ్వర కాలేజీ పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం నుంచే టీడీపీ అరాచకం మొదలైంది. టీడీపీ నేతలు క్యూ లైన్లలోనే ఉంటూ నిబంధనలు ఉల్లంఘించి సైకిల్‌కు ఓటేయాలని ఓటర్లకు సూచించారు. ఇది పద్ధతి కాదని వైఎస్సార్ సీపీ వారు సూచించినా లెక్క చేయలేదు. పోలీసులు కూడా పట్టించుకోలేదు. పోలింగ్ బూత్‌కు ఎదురుగా ఉన్న ఇంట్లో ఓ ప్రైవేటు కాలేజీ కరస్పాండెంట్‌తో పాటు మరో పదిమంది మహిళలు తిష్టవేసి ఓటర్లను ప్రలోభపెడుతున్నా పోలీసులు స్పందించలేదు. ఓటు పేరుతో క్యూలైన్లోకి వెళ్లడం, పసుపు రకం కూల్‌డ్రింకులు ఇస్తూ టీడీపీకి ఓటేవేయమని సూచించడం, చివరకు ఓటర్లు అభ్యంతరం వ్యక్తం చేయడం, ఆ విషయం వైఎస్సార్ సీపీ అభ్యర్థి బాలినేని దృష్టికి చేరడంతో ఆయన వచ్చి ఉమామహేశ్వర కాలేజీ అధినేతను హెచ్చరించారు. మీరు పట్టించుకోరా అంటూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటికి స్వస్తి పలకాలని సూచించి అక్కడి నుంచి బాలినేని వెళ్లిపోయారు. ఆ తర్వాత కూడా అక్కడున్న మోర్ మార్కెట్ వద్ద ఒక యువతికి టీడీపీ నాయకుడు చెప్పు చూపించి మరీ హెచ్చరించడంతో ఆమె సోదరుడు, మరికొంత మంది కలిసి ఆ యువకునిపై కలబడ్డారు. వారిని విడదీసి పోలీసులు పంపించేశారు. ఈ విషయం తెలుసుకున్న దామచర్ల జనార్దన్.. ఏం జరిగిందో తెలిసికూడా దాదాపు 200 మందితో ఆ కాలేజీ వద్దకు చేరుకుని యువతి సోదరుడిని వెంటాడి ఓ ప్రైవేటు అపార్టుమెంట్ సెల్లార్‌లోకి పరిగెత్తినా వదలకుండా దగ్గరుండి మరీ తన అనుచరులతో దాడి చేయించాడు.



ఒంగోలులోని ఉమామహేశ్వర పోలింగ్ బూత్ వద్ద భారీగా అనుచరులతో హల్‌చల్ చేస్తున్న దామచర్ల



దామచర్ల ఎదురుగా యువకుడిపై దాడి చేస్తున్న టీడీపీ నాయకులు

వెంగముక్కలపాలెం పోలింగ్ బూత్ వద్ద వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కర్రలతో దాడి...

సాయంత్రం 6 గంటల తర్వాత కూడా పోలింగ్ జరుగుతుండటంతో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు శ్రీకావ్య అక్కడకు చేరుకున్నారు. ఆమెపై టీడీపీ నాయకులు దాడికి యత్నించగా, వైఎస్సార్ సీపీ నాయకులు అడ్డుకున్నారు. ఆమెను అక్కడి నుంచి పంపించేశారు. కానీ, టీడీపీ నాయకులు మాత్రం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసుల వద్ద ఉన్న లాఠీలు తీసుకుని మరీ దాడి చేశారు.

ఒంగోలు ఆగ్జిలియం అఖిల వికాస్ వద్ద రెచ్చగొట్టే వ్యాఖ్యలు...

స్థానిక గోరంట్ల కాంప్లెక్స్ సమీపంలో ఆగ్జిలియం అఖిల వికాస్ పోలింగ్ కేంద్రంలో ఒక టీడీపీ నాయకుడు తిష్టవేశాడు. అతనిని బయటకు పంపాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సూచించినా పోలీసులు పట్టించుకోలేదు. దీంతో అతనిని బయటకు పంపే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని బాలినేని స్పష్టం చేశారు. సీఐ నిర్లక్ష్యంగా వ్యవహరించినా బాలినేని వెనుకంజ వేయకపోవడంతో చివరకు డీఎస్పీ వచ్చి సమస్యను సర్దుబాటు చేశారు. బాలినేని అక్కడి నుంచి వెళ్తున్న సమయంలో డీజే జిందాబాద్ అంటూ టీడీపీ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. బాలినేని సంయమనం పాటించడంతో విషయం సద్దుమణిగింది.

కారుతో జంటను ఢీకొట్టి.. మానవత్వం మరిచిన దామచర్ల...

ఒంగోలు నగరంలోని టీడీపీ కార్యాలయం ముందు ఒక జంట బైకుపై వెళ్తుండగా, టీడీపీ కార్యాలయంలోకి వెళ్తున్న దామచర్ల జనార్దన్ కారు వారిని ఢీకొంది. భార్యాభర్తలిద్దరూ కింద పడిపోయినా అతను కారు ఆపకుండా నేరుగా పార్టీ కార్యాలయంలోకి వెళ్లిపోయాడు. సమీపంలోని వారు వచ్చి వారిని పరామర్శించారు. పెద్దగా దెబ్బలు తగలకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.